


మనం

తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు

మంగళవారం 03- 06 - 2025

4 పేజీలు




# నిడదవోలు పురపాలక సంఘంలో జనసేన పాగా

- వైస్ ఛైర్మన్ గా షేక్ వజీరుద్దీన్ ఎంపిక కావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం
- రాష్ట్రంలో జనసేన పార్టీ కైవసం చేసుకున్న ఏకైక మున్సిపాలిటీ నిడదవోలు అని మంత్రి దుర్గేష్ వెల్లడి
- ఇది ఆరంభం మాత్రమే.. భవిష్యత్ లో జరిగే ఏ ఎన్నికల్లో అయినా కూటమి విజయంలో జనసేనది కీలకపాత్ర అని పేర్కొన్న మంత్రి
- రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా నిడదవోలు మున్సిపాలిటీ విజయం అందిస్తామన్న మంత్రి దుర్గేష్
- జనసేన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి దుర్గేష్
- పురపాలక విజయంతో భారీ ఎత్తున జనసేన పార్టీ శ్రేణుల సంబురాలు..
- జై కందుల దుర్గేష్, జై జనసేన, జై కూటమి అంటూ నినాదాలు





**నిడదవోలు జూన్ 2 మనం న్యూస్ :** నిడదవోలు పురపాలక సంఘంలో కూటమి విజయం సంపూర్ణమైందని మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పలు అంశాలపై మాట్లాడారు. జీరో సభ్యుల నుండి మున్సిపాలిటీ తమ పరం చేసుకోవడం అసాధారణ విషయమని, రాష్ట్రం మొత్తం మీద జనసేన పార్టీ కైవసం చేసుకున్న ఏకైక మున్సిపాలిటీ నిడదవోలు అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అంతకుముందు వైస్ ఛైర్మన్ జనసేన వశం కావడంతో క్యాంపు కార్యాలయం ముందు జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నాయి. జై కందుల దుర్గేష్, జై జనసేన, జై కూటమి అంటూ నినదించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సోమవారం నిడదవోలు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవికి జరిగిన ఎన్నికతో పురపాలక సంఘం పూర్తిగా జనసేన కైవసం చేసుకుందని ఆనందం వ్యక్తం చేశారు. నిడదవోలు పట్టణంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ముస్లీం, మైనార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న షేక్ వజీరుద్దీన్ వైస్ ఛైర్మన్ గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాజకీయ నేపథ్య కుటుంబం నుండి వచ్చిన వజీర్ కు రాజకీయాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ప్రజలకు సేవ చేయాలనుకున్న వ్యక్తిని వైస్ ఛైర్మన్ గా ఎంపిక చేసుకోవడం గర్వకారణమన్నారు. పట్టణంలోని ముస్లిం, మైనార్టీల ప్రయోజనాలు కాపాడాలని వజీర్ కు మంత్రి దుర్గేష్ సూచించారు. కూటమి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జనసేన పార్టీని సంస్థాగతంగా బలపరిచేలా పని చేయాలని ఆదేశించారు. ఇది ప్రారంభం మాత్రమే.. ఇక ముందు జరగబోయే ఏ ఎన్నికల్లో అయినా కూటమి విజయం సాధించడంలో జనసేన కీలక పాత్ర పోషిస్తున్నందని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్, ఇతర కౌన్సిలర్లు తమ పదవీ కాలంలో నిడదవోలు పట్టణ పురోగతికి దోహదపడాలని సూచించారు.

### రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా నిడదవోలు మున్సిపాలిటీ విజయం

జూన్ 4వ తేదీ నాటికి సాధారణ ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుపుతున్న పండుగలో నిడదవోలు మున్సిపాలిటీ విజయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా అందిస్తున్నామన్నారు. ఒక రోజు ముందుగానే విజయోత్సాహాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అరాచక పాలన అంతమొందించి సుపరిపాలన ప్రారంభమైన రోజుగా జూన్ 4న డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పార్టీ ద్వారా కూటమి నాయకులతో కలిసి వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సంపూర్ణ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి కందుల దుర్గేష్ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో వైస్ ఛైర్మన్ పదవిని త్యాగం చేసిన వెంకటలక్ష్మికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోటీలో ఉన్నప్పటికీ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని సంపూర్ణంగా సమర్థించి కూటమికి అనుకూలంగా పూర్తి స్థాయిలో వ్యవహరించిన సీనియర్ కౌన్సిలర్ రతీదేవికి, పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ సూచించిన అభ్యర్థికి తప్పనిసరిగా ఓటు వేస్తామని చెప్పిన కౌన్సిలర్లను ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### నిడదవోలు పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఇప్పటికే కోట్లాది రూపాయలతో నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధిగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ వజీర్, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, మాజీ వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మీ, నిడదవోలు జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మోర్త సాయి కుమార్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

## – ఐదుగురు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం







**రాజానగరం, జూన్ 02, మనం న్యూస్** ,:రాజానగరం టు కాకినాడ ఏడీబి రోడ్డుపై వడిసలేరు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా మరో ఇద్దరికి విషమంగా ఉన్నట్లు డీఎస్పీ దివ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజానగరం మండలం రఘుదేవపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ (40), రేలంగి దేవి లలిత (34), కుమార్తె రేలంగి వర్షిత (13), రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యికి చెందిన తీగిరెడ్డి శివ (30), తీగ రెడ్డి సాన్వి (4) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీగి రెడ్డి భవాని, రేలంగి హర్షిత లకు తీవ్ర గాయాలు కావడంతో అత్యవసర చికిత్స నిమిత్తం గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న సాయి హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వరలక్ష్మి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

# సత్యనారాయణపురంలో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం

**విజయవాడ జూన్ 2 మనం బ్యూరో:** సోమవారం ఉదయం విజయవాడలోని నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి అతిథులుగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా, విజయవాడ సి పి రాజశేఖర్ బాబు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు హాజరువ్వడం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు



కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రత ల పరిరక్షణ కోసం సిసి కెమెరాలు,డ్రోన్స్, పోలీస్ స్టేషన్ ఆధునీకరణకు సహరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా లోని పోలీస్ స్టేషన్ల ఆధునికరణ తోపాటు అభివృద్ధి కి కృషి చేస్తున్న కమిషనర్ రాజశేఖర్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. హోం మినిస్టర్ అనిత ఆధ్వర్యంలో రాబోయే రెండు మూడు ఏళ్లలో రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ మోడరన్ పోలీస్ స్టేషన్ అవుతుందని తెలియజేశారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయానికి దీటుగా సత్యనారాయణ పురం పోలీస్ స్టేషన్ నిర్మాణం జరిగిందని అన్నారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ విభాగం లో రాష్ట్రం లోనే ఆదర్శవంతమైన జిల్లాగా తయారు అవుతుంది అని వివరించారు.ఇప్పటికే జగ్గయ్యపేట, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో మొత్తం, నందిగామ నియోజకవర్గం లో 80శాతం సిసి కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్ల అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం పై ఆధారపడకుండా దాతలు ముందుకు రావాలని పిలుపు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా





## షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా

## కే.ఎస్. జవహర్, చైర్మన్, రాష్ట్ర ఎస్సీ కమిషన్

**విజయవాడ జూన్ 2 మనం ప్రతినిధి :** రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 4వ ఫ్లోర్ గల ఎస్సీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ గా కుటుంబ సభ్యుల మధ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నాకు చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు.. రాష్ట్రంలోని ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని పనిచేస్తానన్నారు.. గతంలో ఎన్నడూ లేనివిధగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.. రాష్ట్రం లోని దళితులందరూ కూటమి పాలనలో ఏంతో సంతోషంగా ఉన్నారని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేనన్నారు. గతంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెరిగాయన్నారు.. రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా కమిషన్ పనిచేస్తుందన్నారు.. సమసమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడం చాలా సంతోషంగా ఉందని చైర్మన్ కేఎస్ జవహర్ తెలిపారు. ముందుగా ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ గా కేఎస్ జవహర్ ను నియమించటం దళితులందరికీ సంతోషదాయక మన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు, ఎమ్మెస్ రాజు, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా లు పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ బత్తుల జీవపుత్ర కుమార్, చైర్మన్ పీ.ఎస్ ఎల్.ఎమ్ కిషోర్, తదితరలు పాల్గొన్నారు.

అనంతరం తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన అభినంధన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు బండారు సత్యానందరావు, తంగిరాల సౌమ్య, వేగుళ్ల జోగేశ్వరావు, పితాని సత్యారాయణ, ఎస్సీ మాల సంక్షేమ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని చైర్మన్ ను బొకేలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# ఎన్టీఆర్ అవార్డులు రావడం అభినందనీయం.



## నిమ్మల రామానాయుడు.

**పాలకొల్లు, జూన్ 2,మనం ప్రతినిధి :** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సూర్యచంద్ర కల్చరల్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా హైదరాబాద్ నందు ఎన్టీఆర్ ఎక్స్ లెన్స్ అవార్డులు పొందిన గుడాల హరిబాబు. వడ్లమాని హరికృష్ణ లను రాష్ట్ర జలవనురుల శాఖామాత్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామానాయుడు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన పాలకొల్లు పేరును కళాకారులుగా నిలబెడుతుచున్న రని. అత్యంత ప్రతిష్టాత్మకమైన మహనీయుడు ఎన్టీఆర్ పేరున అవార్డు లు రావడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు. గండేటి వెంకటేశ్వరరావు. విన్నకోట వెంకటరమణ. రావూరి అప్పారావు. తాళబత్తుల వెంకటేశ్వరరావు. శివాల రామారావు. పుచ్చల నాగలింగేశ్వర రావు. కొంతేటి శాంతారావు. జి ఎస్ ఎన్ రవి. ఓడూరు సురేష్ పాల్గొన్నారు.ం

# వైభవంగా ధన శైల రామాలయంలో ప్రతిష్టా మహోత్సవాలు

## ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని అనుగ్రహ భాషన చేసిన అహోబిల రామానుజ జీయర్ స్వామి

## ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట జూన్ 2 మనం న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ ధన శైల సీతారామ స్వామి దేవస్థానం (పెద్ద రామాలయం) లో శ్రీ భగవద్ రామానుజ , శ్రీ శతకో ప, శ్రీ గోదా ,శ్రీ సంతాన వేణుగోపాల స్వామి సహిత శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి జీర్ణోద్ధరణ ప్రయుక్త నూతన శిలామయ ఆలయ యంత్ర విగ్రహ ధ్వజస్తంభ గర్భాలయ విమాన శిఖర కలశ ప్రతిష్టాపన మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాలను సోమవారం ఉదయం ఎనిమిది గంటల ఆరు నిమిషాల కు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిదండిఅహోబిల రామానుజ జీయర్ స్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. ఈ కార్యక్రమాలలో



జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ దంపతులు,





ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవాల అనంతరం ప్రధమరాధన శాంతి కల్యాణం మంగళ నీరాజనంకార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో యువ నేత శ్రీరామ్ చినబాబు , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు , పలువురు ప్రముఖులు నేతలుపెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు .అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

# గడిచిన జూన్ నాలుగవ తారీకు రాష్ట్ర ప్రజలకు దుర్దినం

## – వైయస్సార్సీపీ పోడూరు మండల అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి

## కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైంది.

## సనాతని పవన్ కళ్యాణ్ ని కూడా ఎండగట్టాలి

**పోడూరు జూన్ 2 మనం న్యూస్ :** గత సంవత్సరం గడిచిన జూన్ 4వ తారీఖున రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఈ రాష్ట్ర ప్రజలకు దుర్దినమని పోడూరు మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తయినప్పటికీ సూపర్ స్టిక్స్ హామీలనుంచి ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయక ప్రజలను మోసం చేయడంతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు,వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు జూన్ 4వ తారీఖున భారీగా నిరసనలు తెలుపుతున్నామని వీరస్వామి అన్నారు.దానిలో భాగంగా వెన్నుపోటు



దినం పోస్టర్ని సోమవారం పెనుమాదం గ్రామం లో వైయస్సార్సీపీ శ్రేణులతో కలిసి కొర్రపాటి వీరస్వామి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలపై భవిష్యత్తుపై నీళ్ళు చల్లిందని ఎద్దేవా చేశారు, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మోసాలను ఎండగట్టేందుకే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని భారీగా చేపట్టబోతున్నామని అన్నారు.రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న మోసాలను నిలదీసే ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, నిరుద్యోగులు, కార్మికులు, భారీ ఎత్తున పాల్గొని ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి వచ్చే విధంగా నిరసన జ్వాలలను వినిపించాలని పిలుపునిచ్చారు.డిప్యూటీ సిపిఎం గా ప్రమాణ స్వీకారం చేసి చంద్రబాబు చేస్తున్న పరిపాలనలోని మోసాలను ప్రశ్నించకుండా తిరుగుతున్న సనాతని పవన్ కళ్యాణ్ ని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఎండగట్టాలని అన్నారు. అంతేకాకుండా ఈ రాష్ట్ర ప్రజల తరఫున వైఎస్ఆర్సిపి ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందని తెలియజేశారు. ఈ రాష్ట్రంలో లేదు అరాచక, అన్యాయం అక్రమ కక్ష సాధింపు పరిపాలన కొనసాగుతుంది తప్ప సంక్షేమం అభివృద్ధి కరువయ్యాయని అన్నారు.

# ధన శైల రామాలయంలో ప్రతిష్ట మహోత్సవాలలో పాల్గొన్న సామినేని ఉదయభాను





**జగ్గయ్యపేట జూన్ 2 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణంలోని ధన శైల రామాలయంలో సోమవారం జరిగిన పునః ప్రతిష్ట మహోత్సవాలు, మహా కుంభాభిషేక ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం ప్రభుత్వ వైద్యశాల కమిటీ మాజీ సభ్యులు కటారి హరిబాబు తదితర నేతలు ప్రముఖులు జనసేన నేతలు పాల్గొన్నారు.

# రోడ్డుపై గోతులు పూడ్చాలని సిబ్బందికి ఆదేశాలు



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 2 మనం న్యూస్:** జంగారెడ్డిగూడెం రహదారులపై ఉన్న గుంతలను పూడ్చాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ సిబ్బందికి సూచించారు ప్రధానంగా గంగానమ్మ గుడి బస్టాండ్ మసీద్ ఇతర కోడళ్ళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న గుంతలను పూడ్చాలి అన్నారు మున్సిపాలిటీ ట్రాక్టర్ ఉపయోగించి ఇంజనీరింగ్ అధికారులు పనులను పనులను పూర్తి చేయాలని ఫోన్లో ఆదేశించారు.

# ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొన్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ సి కమిషన్ చైర్మన్ గా కెఎస్ జవహర్.

## ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం వేగుళ్ల లీలాకృష్ణ.






**కొత్తపేట జూన్ 2 మనం న్యూస్ :** విజయవాడ లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవాలు సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ సి కమిషన్ చైర్మన్ గా కొత్తపల్లి శామ్యూల్ జవహర్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ లను కలిసి శుభాకాంక్షలు తెలియజేసీ దుస్సాలువాలతో సత్కరించారు.

# ఈనెల 5న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా నెట్టెం రఘు రామ్ పదవీ బాధ్యతల స్వీకారం

**జగ్గయ్యపేట జూన్ 2 మనం న్యూస్ :** ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా నెట్టెం రఘు రామ్ఈనెల ఐదున పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ కార్యాలయం వారుప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా నియమితులైన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘు రామ్ ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడలోని కృష్ణ డిసిసిబి రీజనల్ ఆఫీసులో పదవీ బాధ్యతల స్వీకారం, అనంతరం ఉదయం 10:30 గంటలకుఅభినందన సభ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ఏలూరు మరియు ఎన్టీఆర్ జిల్లాలకూటమి నేతలుతెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.




# శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి వెండి పళ్లెం బహుకరణ



**భీమవరం, జూన్ 2 ,మనం బ్యూరో :** శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి హైదరాబాద్ కి చెందిన దండు దుర్గా ప్రకాష్ రాజు శైలజా నాగ దుర్గా దంపతులు 504 గ్రాముల వెండి పళ్లెం శ్రీ అమ్మవారికి సమర్పించారు.ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ మద్దిరాల మల్లికార్జున శర్మ వీరికి పూజలు ఆశీర్వచనాలు నిర్వహించినారు.ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి శేషవస్త్రం ప్రసాదం అందచేసినారు.

# నాన్ షెడ్యూల్ పంచాయతీలో కలపండి.. పోలవరం ఎంపిడిఓ కి నిర్వాసితుల వినతి..



**పోలవరం,జూన్ 2 మనం న్యూస్ :** పోలవరం మండలంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కాలనీ చంద్రన్న కాలనీ (పాత పైడిపాక) గ్రామాన్ని నాన్ షెడ్యూల్ పంచాయతీలో కలపాలని నిర్వాసితులతో కలిసి కూటమి నాయకులు సోమవారం పోలవరం ఎంపిడిఓ చెరుకూరి శ్రీనివాస్ బాబుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రత్యేక పంచాయతీగా ఉన్న తమ పాత పైడిపాక గ్రామాన్ని పోలవరం ప్రాజెక్టు లో పునరావాసం అనంతరం షెడ్యూల్ ఏరియా ఇటికల కోట పంచాయతీలో విలీనం చేశారన్నారు. గ్రామంలో అందరూ నాన్ ట్రైబల్ జనాభా ఉన్నందున తమకు పూర్వం ఉన్న విధంగా తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఉంచాలని లేనిచో, షెడ్యూల్ ఏరియా పంచాయతీ నుండి విభజించి నాన్ షెడ్యూల్ పంచాయితీ పోలవరం పంచాయతీలో కలపవలసినదిగా కోరుచున్నామని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కూటమి నాయకులు జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, పోలవరం పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ మంగిన వెంకటరమణ, నిర్వాసితులు ఉన్నారు.

# జంగారెడ్డిగూడెం కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 2 మనం న్యూస్ :** జంగారెడ్డిగూడెం దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు తెలిపారు సోమవారం కళాశాల వద్ద అభ్యర్థుల ధృవపత్రాలను పరిశీలించారు అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

# పొగాకు కు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రదర్శన



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 2 మనం న్యూస్ :** పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు అనంతరం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో రమణకి వినతి పత్రం అందజేశారు ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మాల సురేష్ మాట్లాడుతూ లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పొగాకును పండిస్తే గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారని అన్నారు.

# రోగనిరోధక శక్తిని సహజసిద్ధంగా పెంచే ఆహారాలు



**గాంధీనగర్ జూన్ 2 మనం న్యూస్:** బాదం, పసుపు, అల్లం వంటి పోషకాలు అధికంగా ఉండే సూపర్ ఫుడ్‌లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవటంతో పాటుగా కోవిడ్ వంటి విపత్కర సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో గణనీయంగా సహాయపడుతుందని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచిస్తున్నారు. కాలిఫోర్నియా బాదం, పసుపు, అల్లం, వెల్లుల్లి, సిట్రస్ పండ్లు, బొప్పాయి రోగనిరోధక శక్తిని పెంచే సూపర్ ఫుడ్‌లుగా డాక్టర్ రోహిణి సిఫార్సు చేస్తున్నారు. కాలానుగుణ ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కల్పించడానికి, మొత్తం శ్రేయస్సును కాపాడుకోవడానికి ఫ్లూ సీజన్‌లో బాదం వంటి ఈ సూపర్ ఫుడ్‌లను ఆహారంలో చేర్చుకోవాలని డాక్టర్ పాటిల్ సూచించారు.

# రూ. 2525 కోట్ల పెట్టుబడితో అపర్ణ మూన్‌స్టోన్ లగ్జరీ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ



**గాంధీనగర్ జూన్ 2 మనం న్యూస్:** ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ గోపన్‌పల్లి-గచ్చిబౌలి రహదారి వద్ద ఉన్న దాని ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అయిన అపర్ణ దక్కన్ టౌన్‌లో ప్రీమియం రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ అపర్ణ మూన్‌స్టోన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. రూ. 2525 కోట్ల పెట్టుబడి అంచనాతో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్, హైదరాబాద్ యొక్క అభివృద్ధి చెందుతున్న నగర జనాభాకు అనుగుణంగా అత్యాధునిక, పర్యావరణ అనుకూల, విలాసవంతమైన జీవన శైలి అనుభవాలను అందించడంలో కంపెనీ యొక్క అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుంది. అపర్ణ మూన్‌స్టోన్ అనేది ఆలోచనాత్మకంగా రూపొందించబడిన గేటెడ్ కమ్యూనిటీ. ఇది జి ప్లస్ 44 అంతస్తులతో ఎనిమిది సొగసైన హై-రైజ్ టవర్‌లను కలిగి ఉంటుంది. మొత్తం 2088 విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లను అందిస్తుంది. 22.28 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో 2166 నుండి 3140 చదరపు అడుగుల వరకు విశాలమైన నివాసాలు ఉంటాయి. సౌకర్యం, అధునాతనత రెండింటినీ కోరుకునే సమకాలీన గృహ యజమానుల ఆకాంక్షలను తీర్చడానికి ఇవి రూపొందించబడ్డాయని అపర్ణ కన్స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎస్ రెడ్డి వెల్లడించారు.

# హైదరాబాద్, బెంగళూరులో శామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' కార్యక్రమం




**గుంటూరు జూన్ 2 మనం న్యూస్:** శామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' సీజన్ 4 దక్షిణ భారతదేశానికి విస్తరించింది. ఈ కార్యక్రమం యువత ఆధారిత ఆవిష్కరణలకు దోహదపడుతూ, సామాజిక ప్రభావాన్ని కలిగించే పరిష్కారాలను ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్‌లోని ప్రగతిశీల విద్యాసంస్థల్లో, బెంగళూరులోని ప్రముఖ టెక్నాలజీ కేంద్రాల్లో విద్యార్థులు సానుభూతి, ప్రయోజనం, డిజైన్ థింకింగ్ సూత్రాల ఆధారంగా స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు ముందుకొస్తున్నారు. సాల్వ్ ఫర్ టుమారో భారతదేశం అంతటా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నందున, ఇది తన పరిధిని విస్తరించడమే కాదు.. కొత్త అవకాశాలను అన్లాక్ చేస్తోంది. హైదరాబాద్ నుండి బెంగళూరు వరకు.. త్వరలో ఈశాన్య ప్రాంతాలకు ఈ కార్యక్రమం విద్యార్థుల నేతృత్వంలోని ఆవిష్కరణలతో కూడిన భవిష్యత్తును పెంపొందిస్తోంది.

# పత్తి సాగు కోసం పురుగుమందు జివోరాను ఆవిష్కరించిన క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్

**గుంటూరు జూన్ 2 మనం న్యూస్:** తన పురుగుమందుల పోర్ట్‌ఫోలియోను విస్తరించడంపై తదేక దృష్టితో, భారతదేశంలోని ప్రముఖ వ్యవసాయ రసాయన ఉత్పత్తుల సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ (సీసీపీఎల్), ఒక ప్రధాన పరిశోధన ఆధారిత పురుగుమందు రకాన్ని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. భారతదేశ పంట సంరక్షణ మార్కెట్ సీఏజీఆర్ 4.35 శాతంతో, 2025లో 2.59 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 3.21 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయబడిన సమయంలో ఈ ఆవిష్కరణ చోటు చేసుకుంది. ఈ విభాగంలో తన వృద్ధిని మరింతగా పెంచుకోవడానికి, మార్కెట్ లీడర్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి సీసీపీఎల్ తదుపరి తరం పురుగుమందు జివోరాను ఆవిష్కరించింది, ఇది పత్తిలో రసం పీల్చే తెగుళ్ల వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి రూపొందించబడింది.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన తోట వెంకటరాజు



**ఆలమూరు జూన్ 02 మనం న్యూస్.** జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో ఆలమూరు మండలంలోని సందిపూడి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరాజు సోమవారం వెలువడిన ఫలితాలలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఆలిండియా స్థాయిలో ఓపెన్ క్యాటగిరి ద్వారా ఓవరాల్‌గా 1533వ ర్యాంకు, జిఈఎన్ -ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 135వ ర్యాంకు సాధించారు. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అత్యంత ప్రతిభ కనబరిచి ఇప్పుడు జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ ఐఐటీలో సీటు సాధించి ఇంజనీరింగ్ పూర్తి చేసి తల్లిదండ్రుల కలను నెరవేర్చడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ మేరకు మండలంలోని పలువురు రాజకీయ నాయకులు, మండల అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు వెంకటరాజును అభినందించారు.

# కార్పొరేషన్ చైర్మన్ ల పదవీ స్వీకార ఉత్సవాలలో పాల్గొని

## శుభాకాంక్షలు తెలిపిన జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను





**జగ్గయ్యపేట జూన్ 2 మనం న్యూస్ :** పలు కార్పొరేషన్ చైర్మన్ ల పదవీ స్వీకార ప్రమాణ ఉత్సవాలలో పాల్గొని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్గా మండపేట నియోజకవర్గం ఇన్చార్జి వేగుళ్ల లీలా కృష్ణ పదవీ స్వీకార ప్రమాణ మహోత్సవంలో సామినేని ఉదయభాను పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలానే ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులుసామినేని ఉదయభాను పాల్గొని శుభాకాంక్షలు తెలిపి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొని జనసేన నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 2 మనం న్యూస్:** మెట్ట ప్రాంతంలో పామాయిల్, పొగాకు, కోకో,రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెం లో ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరి ముఖ్యంగా జంగారెడ్డిగూడెం ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

# కళాశాల అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్ అంతోనమ్మ సేవలు అభినందనీయం

వీరమాచినేని సత్యప్రసాద్






**హనుమాన్ జంక్షన్ :జూన్ 2 మనం న్యూస్ :** సేవకు ప్రతి రూపంగా నిలిచి 12 సంత్సరాల పాటు అహర్నిశలు కళాశాల అభివృద్ధి కోసం, విద్యార్థినుల పురోభివృద్ధి కోసం కృషి చేసిన సిస్టర్ అంతోనమ్మ అభినందనీయురాలని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం హనుమాన్ జంక్షన్ జె.ఎం.జె మహిళా కళాశాలలో గత 12 సంవత్సరాలుగా ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ విశాఖపట్నం బదిలీఅయిన సిస్టర్ పోలవరపు అంతోనమ్మకు సోమవారం ఉదయం కళాశాల ఆవరణలో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సిస్టర్ ఆంతోనమ్మను ఘనంగా సన్మానించారు. ఆమె జె.ఎం.జె,కళాశాలకు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్,లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ గ్లోబల్ ప్రెసిడెంట్ తాడి రంగారావు , ప్లానర్ దాసరి బెనర్జీ , డాక్టర్ వీరమాచినేని స్రవంతి, డాక్టర్ గొర్రెపాటి అశోక్,మేడేపూడి రామమోహనరావు, వీరమాచినేని బుజ్జి, పొలవరపు సుశీలమ్మ, మరియరాజు, పార్వతి, ముత్యాల సువర్ణరాజు, గొట్టాపు వాసు కళాశాల స్టాఫ్ ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.ద

# ఇండియన్ బ్యాంకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ ఖాతాలకు ఎంఓయు సంతకం



**పోడూరు జూన్ 2 మనం న్యూస్ :** ఇండియన్ బ్యాంకు యాజమాన్యం గత నెల 28వ తారీఖున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒక ముఖ్యమైన ఒప్పందాన్ని (ఎంఓయు ) ను కుదుర్చుకుని సంతకం చేసింది.ఈ ఒప్పందాన్ని గురించిన సమాచారాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు తెలియజేయడానికి పోడూరు శాఖ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు సోమవారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఎంపీడీవో బిఎస్ఎన్ఎల్ మంగ కుమారికి, తాసిల్దార్ సయ్యద్ మౌలానా ఫజల్ కి ఇంకా ఇతర ప్రభుత్వ ఉద్యోగులకి శాలరీ ఖాతాలను ఇండియన్ బ్యాంకులో ప్రారంభించడం వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరించారు.ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు మాట్లాడుతూ శాలరీ ఖాతాలకు ఇండియన్ బ్యాంకులో ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని దానిలో భాగంగా కోటి రూపాయల వరకు ప్రమాద బీమా,( మరణం లేదా శాశ్వత పాక్షిక అంగవైకల్యం సందర్భంలో ) ఇది వర్తిస్తుందని, 2.5 లక్షల రూపాయల కుటుంబ ఆరోగ్య గ్రూపు భీమా ఉందని,సహజ మరణం సంభవిస్తే పది లక్షల రూపాయల వరకు భీమా సదుపాయం ఉందని, అలాగే అన్ని రకాల రుణాలపై వడ్డీ రాయితీ గోల్డ్ లోన్లతో సహా ఉంటుందని, మరీ ముఖ్యంగా శాలరీ లోన్లపై ఏ విధమైన ప్రాసెసింగ్ ఫీజు లేదని తెలియజేశారు. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులు ఈ సదుపాయాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని ఇంత విస్తృతమైన మరియు లాభదాయకమైన సదుపాయాలు ఇతర ఏ బ్యాంకుల్లోనూ లేవని ఈ విషయాన్ని ఉద్యోగస్తులు గ్రహించాలని కోరారు.ఇంకా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థిక భద్రత మరియు అదనపు ప్రయోజనాలను పొందగలుగుతారని కాబట్టి త్వరలోనే ఇండియన్ బ్యాంకులో ఉద్యోగులు శాలరీ ఖాతాలను ప్రారంభించాలని మేనేజర్ బొంతు దుర్గారావు కోరారు.

# హ్యాపీడెంట్ 'చమ్ కింగ్ గుమ్: చమ్ కా ముస్కాన్, జగ్ మగ్ జహాన్' క్యాంపెయిన్




**గాంధీనగర్ జూన్ 2 మనం న్యూస్:** పెర్ఫెట్టీ వాన్ మెల్ ఇండియా కుటుంబానికి చెందిన చ్యూయింగ్ గమ్ లలో ఒకటైన హ్యాపీడెంట్ ఒక సరికొత్త యాడ్ ఫిల్మ్ ను విడుదల చేసింది. ఈ కొత్త క్యాంపెయిన్ 'చమ్ కింగ్ గమ్: చమ్కా ముస్కాన్, జగమగ్ జహాన్', కాంతులు చిమ్మే చిరునవ్వులో మహిమను, కల్పనా శక్తికి స్ఫూర్తినిచ్చే దానిలోని శక్తిని, కళ్ళను ఆకట్టుకునే ఒక గొప్ప కథా ప్రపంచానికి ప్రేక్షకులను ఆకట్టుకునే ఒక తాజా, సినిమా తరహా లెన్స్ తో బ్రాండ్ తన చారిత్రాత్మకమైన స్టోరీ టెల్లింగ్ (కథను చెప్పే) శక్తిని పునరుత్తేజింపజేసుకుంది. మెక్ కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా వారు ఇతివృత్తం కూర్చిన ఈ క్యాంపెయిన్ కు ప్రఖ్యాత క్రియేటివ్ లీడర్ ప్రసూన్ జోషి నేతృత్వం వహించారు. బాలీవుడ్ లో ప్రఖ్యాతిగాంచిన సంగీతకారుడు, శాంతనూ మొయిత్రా దీనిని స్వరపరిచారు.

# నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు...



**కుక్కునూరు, జూన్ 2 మనం న్యూస్ :** నాటు సారా కేంద్రాలపై కుక్కునూరు పోలీసులు ఉక్కు పాదం మోపారు. సోమవారం కుక్కునూరు సీఐ ఎం. రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండలంని వేలేరు గ్రామ శివారులో ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో సుమారు 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ, నాటు సారా తయారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ సారా తయారీని పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం దాడులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు కూడా నాటు సారా తయారీ, విక్రయాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియ బాధ్యతల స్వీకరణ



**ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ జూన్ 2 మనం బ్యూరో:** సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జేసీ ఛాంబర్‌లో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ గా ఎస్ ఇలక్కియ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ కీలకమైన ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు చాలా ఆనందంగా ఉందని,జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులతో కలిసి కృషిచేస్తానని అన్నారు.శూన్య పేదరికంతో పాటు స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించనున్నట్లు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇలక్కియ.కలెక్టర్ డా. జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన జాయింట్ కలెక్టర్‌కు విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఎస్‌వో ఎ.పాపారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# లేపాక్షి ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

## హస్తకళల అభివృద్ధి పవన్ కళ్యాణ్ అకాంక్ష

## నాదెండ్ల మనోహర్





**విజయవాడ జూన్ 2 మనం బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ హస్త కళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఛైర్మన్ గా తిరుపతి జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ లేపాక్షి కేంద్ర కార్యాలయంలో కుటుంబ సభ్యులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి కార్యకర్యల సమక్షంలో సందడిగా ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ ఎండి విశ్వ మనోహరన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహింపచేసి సంస్థ గురించి నూతన ఛైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ హస్తకళల పట్ల ఎంతో మక్కువ కలిగిన తమ అధినేత పవన్ కళ్యాణ్ తనకు ఈ అవకాశం కల్పించటం తన భాధ్యతలను పెంచిందన్నారు. ఎన్ డిఎ ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు స్ఫూర్తితో హస్తకళాకారుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. లేపాక్షి ప్రదర్శన శాలలను విస్తరింపచేసి విక్రయాలు పెరిగేలా ప్రయత్నిస్తామన్నారు. కనుమరుగవుతున్న కళలకు జీవం పోసేలా ఆసక్తి కలిగిన యువతకు ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేసి వారిని కళాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హరి ప్రసాద్ తెలిపారు. లేపాక్షి ఉన్నతికి , ఆర్ధిక పురోగమనానికి తనకున్న రెండు సంవత్సరాల కాలాన్ని సద్వినియోగం చేసుకుంటానని పసుపులేటి పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ హరిప్రసాద్ ఏ బాధ్యతలు అప్పగించినా సమర్ధ వంతంగా పనిచేస్తారన్నారు. హస్తకళల పట్ల ప్రత్యేక అభిమానాన్ని ప్రదర్శించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా పసుపులేటి వ్యవహరించి లేపాక్షి ఉన్నతి కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా ఉన్న హస్తకళలకు దేశ విదేశాలలో ప్రాచుర్యం లభించేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తామన్నారు. హస్తకళలు, చేనేతలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని దానిని అందిపుచ్చుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. పర్యాటక ప్రదేశాలలో లేపాక్షి ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేయటం ద్వారా గణనీయమైన ఆదాయం పొందగలమన్నారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి హాజరైన వారిలో విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, తాడేపల్లి గూడెం శాసన సభ్యులు బోలిశెట్టి శ్రీనివాసులు, మాజీ ఎంఎల్ ఎ కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, ఎపి హెచ్ ఎం ఐడిసి ఛైర్మన్ శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయిడు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల డిసిఎంఎస్ ఛైర్మన్ లు బండి రామకృష్ణ, మురళి కృష్ణ, జనసేన గుంటూరు, కృష్ణా, ఎన్ టిఆర్ జిల్లాల అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, బండ్రెడ్డి రామకృష్ణ, అమ్మిశెట్టి వాసు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వేల్పూరి శ్రీనివాసరావు, కడప టిడిపి నేత హరిప్రసాద్, జనసేన నాయకులు ఘంటా స్వరూప, కీర్తన తదితరులు ఉన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, వీరమహిళలు, లీగల్ సెల్ సభ్యులు, పూర్వపు చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల నేతలు, అభిమానులు హాజరుకాగా, తొలుత ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. లేపాక్షి అధికారులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

# చంద్రబాబు మానవత్వంతో పేదలకు వైద్య సాయం....

## నియోజకవర్గంలో 78 మందికి సిఎంఆర్ఎఫ్ నిధులు రూ 27 లక్షలు అందజేసిన మంత్రి రామానాయుడు



**పాలకొల్లు, జూన్ 2,మనం ప్రతి నిధి :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వంతో పేద వర్గాలకు వైద్య ఖర్చులు అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు ఆయన కార్యాలయంలోనియోజకవర్గం లో పేద వర్గాలకు వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా 78 మందికి రూ 27 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ 11 నెలల పాలనలో 50 వేల 235 మందికి సుమారు 349 కోట్లు వైద్య సాయం అందించారన్నారు. జగన్ ప్రభుత్వంలో ఆసుపత్రుల యాజమాన్యాలకు వైద్య సేవలు కింద చెల్లించాల్సిన నిధులను సైతం ఎగ్గొట్టగా ప్రభుత్వమే చెల్లించిందన్నారు. గత పాలనలో మిగిలిన వనరులను దోచుకోవడానికి మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక తప్ప చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని జగన్ ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని తెలిపారు. నియోజకవర్గంలో పేదలకు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ సాయం కోసం ఒకసారి దరఖాస్తు చేసుకుంటే మంజూరు అయిన తర్వాత పిలిచి ఇస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు దరఖాస్తు చేసుకుంటే డ్రైన్ల, కాలువల వెంబడి పడవేసేవారని ఆ పార్టీ నాయకుడు దరఖాస్తు చేసుకుంటేనే దిక్కు లేదన్నారు. ఒకే రోజు 78 మందికి 27 లక్షలు వైద్యసాయం అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాష్ట్ర టిడిపి కార్యదర్శి చిట్టిబాబు, పాలకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షులు జివి, పట్టణ టిడిపి కార్యదర్శి వల్లభ శ్రీనివాస్, పుట్టినోడు శ్రీనివాస్, ధనాన్ని ప్రకాష్, జగ్రత్ రాంబాబు, మల్లంపల్లి బాబు, వట్టం గణేశ్వరరావు, బిరుదుకోట సోమశేఖర్,మండాది అవినాష్ బిజెపి నాయకులు ఉన్నమట్ల కపర్తి,కొల్లి కొండ కుమార్ జనసేన నాయకులు,బోనం నరసయ్య, తులా రామలింగేశ్వరరావు, సేడగం సూరి,బిట్టా లక్ష్మీనారాయణ, పెనిశెట్టి శ్రీనివాసరావు, కొమ్ముల దినేష్,కోడి విజయభాస్కరరావు,పాముల రజిని, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, భాను నాని,మామిడి శెట్టి పెద్దిరాజు, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ముందస్తు అడ్మిషన్లతో జర జాగ్రత్త

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ ఉంటేనే ముందుకెళ్లడం మంచిది




**రాజమహేంద్రవరం, జూన్ 2, మనం న్యూస్ :** వేసవి సెలవులు ముగుస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇదే సమయంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. చాలా విద్యాసంస్థలు తమకు ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ లేకుండానే అడ్మిషన్ల పర్వానికి తెర తీశాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లు, ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందుకే అడ్మిషన్లు తీసుకోవడానికి ముందే తల్లిదండ్రులు అప్రమత్తమై సదరు విద్యాసంస్థకు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో, మౌలిక సదుపాయాల కల్పన ఎలా ఉందో సరి చూసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**ప్రభుత్వ గుర్తింపు లేకుండానే తరగతులు :**

తూర్పుగోదావరి జిల్లాలో వందలకొలది ప్రైవేటు విద్యా సంస్థలున్నాయి. అయితే పలు విద్యా సంస్థలు తమ బోర్డులపై రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ అని రాస్తున్నారు గాని వాటిలో కొన్ని ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకుండానే నడుస్తున్నాయి. కొన్ని పాఠశాలలు సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్టు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ప్రారంభానికి అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి. కానీ కొన్ని విద్యాసంస్థలు మసిపూసి మారేడు కాయ చేస్తూ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న అలాంటి పాఠశాలలు ఏడాది చివరలో ఇతర విద్యాసంస్థల పేరున విద్యార్థులతో పరీక్షలు రాయించి మమ అనిపించేస్తున్నాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే తప్ప రెగ్యులర్ విద్యార్థిగా పరిగణించదు. అలాగే మరికొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బ్రాంచీల పేరుతో వేరే చోట పాఠశాలలు, కళాశాలల నిర్వహిస్తూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తున్నాయి. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి తమ పిల్లలను చేర్పించే విద్యా సంస్థ అనుమతి పత్రాలనుముందుగానే నిశితంగా పరిశీలించుకోవాలి. అక్కడ ఉండే మౌలిక సౌకర్యాలేంటో ఆరా తీయాలి. ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందే అంచనా వేసి తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన ప్రైవేటు విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారుల చర్యలు అంతంత మాత్రమే కావడంతో ప్రైవేటు విద్యాసంస్థలు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. అందుకే తల్లిదండ్రుల నిశిత పరిశీలన, వివేకంతో తీసుకునే నిర్ణయం వారి పిల్లల చదువుల అభ్యున్నతికి చక్కని పునాది పడేలా చేస్తుంది. విద్యాశాఖ అధికారులు కూడా ప్రైవేటు స్కూల్స్ లో స్కూల్ యొక్క పూర్తివివరాలు ఎంట్రన్స్ లో డిస్ప్లే చేయించాలని పలువురు కోరుతున్నారు.

**విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాలపై ప్రశ్నించాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలనుకునే ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉందో లేదో తెలుసుకున్న తరువాతే అడ్మిషన్ పొందాలి. అదికూడా ఏ కేటగిరీకి చెందినది అనే విషయం తప్పక అడిగి తెలుసుకోవాలి. సదరు పాఠశాలలో మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం, గాలి, వెలుతురు సక్రమంగా ఇచ్చే భవనాలు ఎంత వరకూ ఉన్నాయనే అంశాలను ముందస్తుగా పరిశీలించుకోవాలి. తమ పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లే వాహనాలు ఎలా ఉన్నాయి, పిట్నెస్ ఉండలేదా..? డ్రైవర్ గురించి, పలు అంశాలపై ఆరా తీయాలి. ఒక్కో తరగతి గదిలో ఎంతమంది విద్యార్థులను కూర్చోబెడతారు? విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు ఉన్నాయా లేదా? వారి విద్యార్హత ఏమిటి, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా..లేరా..? అన్న విషయాన్ని తెలుసుకోవాలి.

జీం1 భవనమైతే అగ్నిమాపక నిబంధనలు పాటిస్తున్నారా? అందుకు అవసరమైన యంత్ర పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచారో లేదో ఆరా తీయాలి. ఫీజులు ప్రభుత్వ నిభందనలకు అనుగుణంగా వసూలు చేస్తున్నారా..లేదా..? పుస్తకాలు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు విక్రయిస్తున్నారా లేదా అనే విషయాలపై చర్చించాలి.

మనం

మంగళవారం 03- 06 - 2025

# భారతదేశానికి రాజధాని మార్పు అవసరం

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి సరికాదు
- మేధావుల మౌనం దేశ భద్రతకు , రాష్ట్రా భవిష్యత్ కు పెను ప్రమాదం
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, జూన్ 2, మనం న్యూస్ :** హైదరాబాద్ ను దేశ రాజధానిగా పరిశీలన చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా దేశ భద్రత దృష్ట్యా రాజధాన్ని సంస్కరించు కోవాల్సిన అవసరం వున్నట్టుగా మేధావులు గుర్తించాలి. భారతదేశానికి ఢిల్లీ రాజధాని ఎంత మేరకు సురక్షితం . రాజధానిగా ఢిల్లీ విపరీతమైన కాలుష్యంతో విష నగరంగా మారిపోయింది . ఢిల్లీ నలుమూలల అసాంఘిక శక్తులకు పూర్తి స్థాయి పట్టు ఏర్పడి వున్నది . ప్రపంచంలోనే అత్యంత కాలుష్య కొరల్లో చిక్కుకున్న నగరంగా ఢిల్లీ చెడు ఖ్యాతిని దక్కించుకుంది . ఢిల్లీ మహా నగరం సుదూర ప్రాంతాల వరకు తీవ్రమైన కాలుష్యం ఇమిడి వుంది . ప్రజల ఆరోగ్యాలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయింది . శత్రు దేశానికి సరిహద్దుగా పటిష్టమైన కట్టు దిట్టమైన భద్రత ఉండటం శాస్త్రీయ పరంగా మంచిది .

పరిపాలనా విభాగం మొత్తం భారత్ కు అటు ఇటు భాగంలో ఉండటం శ్రేయస్సు కారం అని , భారతదేశానికి శాస్త్రీయతగాను , భౌగోళికంగాను, వాస్తు రిత్యా కూడా ఢిల్లీ ఖచ్చితమైన ప్రాంతం కాదని గుర్తించాలి . 75 ఏళ్లుగా భారత్ ఎంతో అభివృద్ధి చెందిందని , గుప్తుల కాలం నాటి పరిస్థితులనే ఇంకను సరిపెట్టుకుంటు అభివృద్ధి అనుకోవటం మంచి పరిణామం కాదని , మేధావుల గనిగా పేరు గాంచిన భారతదేశ మేధస్సు ప్రక్కదారి పడుతుందని బావించాలి . నేడు ఢిల్లీ నలుమూలల వున్నటు వంటి అతి విలువైన భద్రతా సమాచారం పై శత్రు మూఖలు బాగా పట్టు బిగించాయని , దేశ రాజధాన్ని ప్రస్తుత పరిస్థితులుకు అనువుగా పూర్తి స్థాయి శత్రు దుర్భేద్యంగా హైదరాబాద్ వంటి మహానగరంను అంచె లంచెలుగా అభివృద్ధి చేసుకోవటం భారత్ కు ఎంతైనా అవసరం వుంది . హైదరాబాద్ ను భారతదేశ రాజధానిగా పరిశీలన జరుపగలిగితే హైదరాబాద్ నుండి ఖమ్మం వరకు కొత్త కొత్త విధానాలతో భద్రతా ప్రమాణాలను అభివృద్ధి చేయవచ్చును . భారత్ కు ఢిల్లీ రాజధానిగా కాలం చెల్లింది . దేశ భద్రత దృష్ట్యా కొత్తగా అదునాతన పద్ధతుల్లో భారతదేశానికి ఒక కొత్త రాజధాన్ని నిర్మించుకోవాల్సిన గురుతర భాద్యత ఆసన్నమైనదని నేటి పాలకులు గుర్తించి ఆచరణలో పెట్టాలని , పాత పార్లమెంట్ భవనాన్ని మర్చి కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించిన దిశగా కొత్త రాజధాని అవసరాన్ని భారతదేశ భవిష్యత్ దృష్ట్యా ఆలోచన చేయాలని ఆయన సూచించారు.

ఆంధ్రప్రదేశ్ లో కలుషిత రాజకీయాలకు ఉన్న ప్రాదాన్యత రాష్ట్ర అభివృద్ధి , భవిష్యత్ పై ప్రస్తుత కార్పొరేట్ రాజకీయ పార్టీలు దృష్టి చూపటం లేదు అనేది పచ్చి నిజం . రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు పూర్తి కావొస్తున్నా నేటికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరగలేదు . రాజధానిగా అమరావతికి ఎటువంటి చట్ట బద్దత ప్రస్తుతానికి లేదు . అయినా అమరావతి రాజధాని పేరు పై నేటికి సుమారు 15 వేల కోట్లు పై భడి వృధా ఖర్చు చేసారు . ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా సరికాదు అని ప్రపంచ బ్యాంక్ , నాసా వంటి ఉన్నత సంస్థలు పేర్కొన్నా ఆంధ్ర రాష్ట్ర పాలకులు మాత్రం అమరావతే రాజధాని అంటు ఆంధ్రులను మోసం చేస్తు రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు . అమరావతిని కాదన్న వారిని కొన్ని సొంత కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా ప్రశ్నిస్తున్న వారిని దుమ్మెత్తి పోస్తు ఒక వర్గం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు . ఆంధ్రప్రదేశ్ కు ప్రతి ఆంధ్రుడు ఒక గొప్ప రాజధాని కావాలి అని కోరుకుంటున్నారు తప్ప ఇక్కడే కావాలి అని ఏ ఆంధ్రుడు కోరటం లేదు . కార్పొరేట్ పాలకులే ప్రాంతాల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారు . కనీస జ్ఞానం వున్న మేధావులు ఎవరైనా ఏ తీరు తిన్ను లేని అమరావతిని రాజధానిగా ఎంపిక చేసి పచ్చటి పొలాలను , వ్యవసాయాన్ని , పర్యావరణాన్ని పాడుచేస్తారా ! ముందుగా కొంతమేర అభివృద్ధి చెంది వున్న గుంటూరు నగరాన్ని రాజధానిగా ఎంపిక చేస్తారా ! అని ఆలోచించండి . అమరావతికి విపత్తులతో సమస్యలు ఉన్నాయనేది జగమెరిగిన సత్యం. ఈ వాస్తవాన్ని గుంటూరు మేధావి వర్గం గుర్తించి గుంటూరు ను రాజధానిగా అడగక పోవటం బాదాకారం . ఆంధ్రప్రదేశ్ కు ఒక మంచి అద్భుతమైన రాజధాని కావాలి అంటు ఈ తరం ప్రజలకు భవిష్యత్ ఆశ అని , అందుకు సరైన ప్రాంతం గుంటూరు మాత్రమే నని , ఆ తరువాత అన్ని సహజవనరులు పుష్కలంగా ఉన్నటువంటి రాజమండ్రి మాత్రమేనని ఆయన పేర్కొన్నారు..

ఆంధ్రప్రదేశ్ ను ఢిల్లీ పెద్దల రాజకీయ అవసరాలకు ఒక ముడి సరుకు వలే రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని , ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మోదీకి భయపడుతూ గులాం గిరి చేస్తున్నారని , ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ లో మేధావులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారాని , నేడు అంతకు మించిన మేధావులు ఉన్నప్పటికి భయం , బలహీనతలతో మోనం వహిస్తు రాష్ట్ర ప్రయోజనాలకు , భవిష్యత్ కు శాప గ్రస్తులుగా మారిపోయి ఉండి లేనట్టుగా బ్రతికేస్తున్నారు . మన మేధావుల మౌనం తీవ్రవాదం కన్నా ప్రమాదం అని , మన భారతదేశంలో యుద్ధ ప్రాతిప్రదికన సంస్కరించు కోవాల్సిన అత్యవసర పరిస్థితులు మన ముందు వున్నాయని , సంపదను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేసే విధంగా పాలనా సంస్కరణలకు నడుం బిగించాలని , భారతదేశం యొక్క కొత్త రాజధాని మార్పు , అందుకు అనువైన ప్రాంతాల్లో హైదరాబాద్ ఒకటి ఉందనే నిజాన్ని దేశ వ్యాప్తంగా గుర్తించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్స్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , దుద్దే సురేష్ , గుద్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా, మోర్త ప్రభాకర్ , మేడిచర్ల శ్రీనివాసరావు , వాడపల్లి జ్యోతిష్ , సుంకర వెంకట భాస్కర రంగారావు , వాకాటి అచ్యుతరావు , చల్లా సాంబశివరావు, ఎస్ కె సైపుల్లా, అడపా దేవుడు , కొట్టేటి సత్యనారాయణ, చల్లా వంశీ , చల్లా అఖిల్ , మేమిదాసు చిన తల్లి , మాసా అప్పాయమ్మ ఏమిదాసు శాంతి, రెడ్డి స్వర్ణలత, రెడ్డి భవ్య శ్రీ , కోట సుశీల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నచ్చిన సమయంలో రేషన్ బియ్యం తీసుకోవచ్చు

- ఎండీయూ వాహనాల రేషన్ అక్రమాలకు ఇక చెక్
- వైసీపీ రైస్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకే రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ
- రేషన్ దుకాణాలపై అధికారుల నిఘా ఉంటుంది
- వికలాంగులకు... 65 ఏళ్ళ దాటిన వారికి ఇంటికే బియ్యం
- సన్నబియ్యం ఇస్తానన్న సన్నాసి ఇవ్వలేదు
- కూటమి అలాంటి హామీలు ఇవ్వదు
- ఎండీయూ ఆపరేటర్లపై సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయం
- రేషన్ దుకాణాలు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, జూన్ 02, మనం న్యూస్ :** ప్రజలకు అనుకూలమైన సమయంలో రేషన్ బియ్యం తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 29,760 రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు) చెప్పారు. సోమవారం సిటీలోని రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత 11వ వార్డులో తోట కిరణ్ రేషన్ దుకాణంలో ప్రజలకు కూటమి నాయకులు మజ్జి రాంబాబు, కురగంటి సతీష్, జామి సత్యనారాయణ, ఆర్డీవో కృష్ణ నాయక్, అర్బన్ తహశీల్దార్ లతో కలిసి బియ్యం పంపిణీ ప్రారంభించి అనంతరం ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రేషన్ అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గతంలో ఎండియూ వాసనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ పేరుతో వైసీపీ నాయకులు రైస్ మాఫియాకు తెరలేపారని దానికి అడ్డుకట్ట వేసేందుకే ప్రజల కోరిక మేరకుకూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాలు తిరిగి పునరుద్ధరించి ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ దుకాణాల్లో రేషన్ బియ్యం ఇస్తారని ఆయన తెలిపారు. ప్రజలు తమకు అనువైన వేళల్లో వెళ్ళి తెచ్చుకోవచ్చని, గతంలో మాదిరి ఎండియూ వాహనం ఎప్పుడు వస్తుందా అని పనులు మానుకుని ఇళ్ళవద్ద వేచి ఉండనవసరం లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. అప్పుడు ఎండియూ వాహనం వచ్చినా సర్వర్ పని చేయడం లేదని రేషన్ ఇవ్వకుండా వెళ్ళి పోయేవారని ఆయన ఆరోపించారు. ఎండీయూ వాహనాల పేరుతో వైసీపీ రైస్ మాఫియా బియ్యం పక్కదారి పట్టించి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. ఆ రైస్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల కోరిక ప్రకారం మళ్ళీ రేషన్ దుకాణాల్లో రేషన్ పంపిణీ చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులకు 5వ తేదీలోగా ఇంటికి వెళ్ళి రేషన్ అందచేస్తారని అన్నారు. వైసీపీ వారిలా హామీలు ఇవ్వబోమని, గతంలో సన్నబియ్యం ఇస్తానన్న సన్నాసి ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు రేషన్ దుకాణాల్లో సర్వర్ పని చేయకపోయినా ప్రజలను ఇబ్బంది పెట్టకుండా వారి ఫోటో తీసుకుని



రేషన్ ఇచ్చి పంపిస్తారని తర్వాత దానికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేస్తారని ఆయన చెప్పారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలు జరగకుండా ఆర్డీవో, ఎమ్మార్వో స్థాయి అధికారుల నిఘా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎవరి పొట్ట కొట్టదని, ఎండీయూ ఆపరేటర్ల వినతిని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పరిశీలించి ఏ నిర్ణయం తీసుకోవాలో ఆలోచిస్తారని ఆయన అన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా మళ్ళీ రేషన్ దుకాణాలు పునరుద్ధరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన 1వ వార్డు లాలా చెరువు రేషన్ షాపు నెం.69, 46వ వార్డు రామదాసు పేట 62 నెం.రేషన్ డిపో, 36వ వార్డు తుమ్మలావ 24వ నెం.షాపు, 13వ వార్డు అంబేద్కర్ నగర్ షాప్ నెం.90 లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రేషన్ దుకాణాలను ప్రారంభించి రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 11వ డివిజన్ ఇంచార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వి రామారావు, జిల్లా అధ్యక్షులు జామి కృష్ణ, గౌరవ అధ్యక్షులు బత్తిన నారాయణ రావు, రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షులు నమ్మి వెంకటేశ్వరావు, కార్యదర్శి కె రమేష్, కోశాధికారి కె ఆదిరాజు, జాయింట్ సెక్రటరీ పుల్లూరి శ్రీను, చల్లా వెంకటేష్, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధవళేశ్వరం గోదావరి డెల్టా పరిధిలోని సెంట్రల్ డెల్టా కాలువకు నీరు విడుదల

ఖరీఫ్ సాగుకు త్వరతగతిన ఆకుమడులు వేసుకుని వరి నాట్లు పూర్తి చేసుకోవాలని పిలుపు.





**ఆత్రేయపురం జూన్ 02 మనం న్యూస్.** ధవళేశ్వరం గోదావరి డెల్టా పరిధిలోని సెంట్రల్ డెల్టా కాలువకు జూన్ 1న ఉదయం 11 గంటలకు గోదావరి. మాతకు పూజలు చేసి సాగునీరు విడుదల చేసిన గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్.చైర్మన్ కరుటూరినరసింహరావు, ఇంచార్జ్ ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజినీర్ వెంకట స్వామి. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతుల అవసరాలు, పశువులకు నీటి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో సెంట్రల్ డెల్టాకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశామని శ్రీనివాస్ అన్నారు. రైతు సోదరులకు కాలువ నీరు వచ్చిన వెంటనే ఖరీఫ్ సాగుకు త్వరతగతిన ఆకుమడులు వేసుకుని వరి నాట్లు పూర్తి చేసుకుని అక్టోబర్ నవంబర్ నెలలో వచ్చే తుపాన్ ముప్పు నుండి విముక్తి పొంది, రబీ నాటులు డిసెంబర్ నాటికి పూర్తి చేసుకున్నట్లయితే మార్చి 31 నాటికి పంట కోసుకుని మూడో పంటగా అపరాల సాగు వేసుకుని రైతులు లబ్ధి పొందగలరని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నర్సింహా రావు, డిఈఈ నాగేంద్ర కుమార్, ఆత్రేయపురం ఎఈఈ మాధవ్, అమలాపురం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ రాజులపూడి వెంకటేశ్వర రావు, అయినవిల్లి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, అయినవిల్లి డిస్ట్రిబ్యూటర్ కమిటీ వైస్ చైర్మన్ సరిపల్లి శ్రీనివాస్ రాజు, వద్దిపర్రు నీటి సంఘ ఆధ్యక్షులు జుజ్జవరపు శ్రీహరి,అధికారులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన వైద్యం

- వైద్య ఖర్చులు భారమైన ప్రతి పేదవాడికి సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, జూన్ 2, మనం న్యూస్ :** పేద ప్రజలకు మరింత చేరువుగా నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఆయన కార్యాలయం నందు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ధవలేశ్వరం గ్రామానికి చెందిన కనకనాల కళ్యాణ చక్రవర్తికి 6,36,570/- రూపాయలు, కాతేరు గ్రామానికి చెందిన చిల్లి ఆశిష్ కు 5,00,000/- రూపాయలు, సాటిలైట్ సిటీ సి.బ్లాక్ చెందిన కోణాటి లలితకు 1,52,779/- రూపాయలు, కాతేరు గ్రామానికి చెందిన పిట్ట సత్యనారాయణకు 84,928/- రూపాయలు, వేమగిరి గ్రామానికి చెందిన యాళ్ల అచ్యుతరామయ్యకు 79,211/- రూపాయలు హుకుంపేట గ్రామానికి చెందిన సలగళ్ల వెంకటరావుకు 75,000/- రూపాయలు మరియు ధవలేశ్వరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త గోరంట్ల రాజు కుటుంబానికి 2,00,000/- లక్షల రూపాయలు మొత్తం కలిపి 17,28,488/- లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన ప్రతి పేదవాడికి సీఎం సహాయ నిధి ఎంతగానో భరోసా ఇస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సహృదయంతో పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వర్తించని అనేకమంది పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తరపున పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, నున్న కృష్ణ, పందూరి అప్పారావు, మట్ట శ్రీను, బొప్పన నాగేశ్వరరావు, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, బొప్పన శ్రీను, బైరెత్తి సరోజినీ, పల్లా రామస్వామి, దొడ్డి బాబ్జి, ఎమ్మెస్సార్ శ్రీను, కొడమంచిలి సూర్య, నాళ్ళ రమేష్, దంగేటి శ్రావణ్, బిక్కిన వెంకటేష్, దాక్షరపు వాసు, ఎల్లపు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నిత్యం మజ్జిగ, సుగంధి పంపిణీ

## అమ్మ తల్లి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష సేవలు




**విజయవాడ, జూన్ 2 మనం ప్రతినిధి :** వేసవికాలంలో నిత్యం ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, సుగంది, ఇతర శీతల పానీయాలను ప్రజలకు పంపిణీ చేసిన అమ్మ తల్లి రవీంద్రనాథ్ రెడ్డి ని పలువురు అభినందించారు. కృష్ణ డిస్ట్రిక్ట్ ఫార్మా డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమ్మ తల్లి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ, సుగంధిని పంపిణి కొనసాగించారు. రవీంద్ర నాథ్ రెడ్డి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విజయవాడ వన్ టౌన్ స్టీల్ ప్యాలెస్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గత కొన్ని రోజులుగా నిర్వహిస్తూ వస్తున్నారు. మజ్జిగ పంపిణీ కొనసాగింది. అసోసియేషన్ అధ్యక్షులు అమ్మ తల్లి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించమని తెలిపారు. భవిష్యత్తులోనూ మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# నెలమూరు విద్యార్థికి జేఈఈ అడ్వాన్స్ లో ఉత్తమ ర్యాంకు



**పెనుమంట్ర జూన్ 2 మనం న్యూస్ :** మండలంలోని నెలమూరు గ్రామానికి చెందిన పాతపాటి వెంకట వివేకవర్మ అనే విద్యార్థికి జేఈఈ అడ్వాన్స్ లో ప్రవేశ పరీక్షలో ఓపెన్ లో 1503 ర్యాంక్, కేటగిరిలో 132 ర్యాంక్ సాధించి పలువురి ప్రశంసలు పొందాడు. ఈ సందర్భంగా వివేకవర్మ తండ్రి శ్రీనివాసరాజు (వర్మ) ప్రభాతవార్తతో తన కుమారుడు సాధించిన విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వివేకవర్మ ఇంటర్మీడియట్ రాజమండ్రి తిరుమల కళాశాలలో చదివాడని, ఇంటర్ లో 976 మార్కులు ఎంపీసీ విభాగంలో సాధించాడని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్ మెయిన్స్ లో కూడా 699 ర్యాంకు వచ్చిందని తెలిపారు. ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 2,50,000 మంది విద్యార్థులు వ్రాసారని తెలిపారు. వీటిలో 17వేల సీట్లు ఉంటాయని తెలిపారు. వివేకవర్మ సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా స్థిరపడేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా వివేకవర్మ తండ్రి శ్రీనివాసరాజు ఆక్వా కల్చర్ సాగు చేస్తుండగా, తల్లి కళ్యాణి గృహిణిగా ఉన్నారు. జేఈఈ అడ్వాన్స్ లో మంచి ర్యాంకు సాధించిన వివేకవర్మకు గ్రామ సర్పంచ్ కుచ్చర్లపాటి వెంకటపతి రాజు మంగతాయారు, ఎంపీటీసీ నాగరాజు వెంకట్రామ రాజు, లక్ష్మి, గొట్టుముక్కల భాస్కర వర్మ మరియు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా




**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 2 మనం న్యూస్ :** ఇల్లు లేని పేదలకు పట్నంలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణ రాజు మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు చివరకు సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు అని మాట్లాడారు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం...

చెరుకూరి శ్రీనివాస్ బాబు ఎంపిడిఓ పోలవరం..



**పోలవరం,జూన్ 2 మనం న్యూస్ :** పోలవరం మండలంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో యోగెంద్ర వారోత్సవాల భాగంగా యోగ ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్ డాక్టర్ బీరా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ, ఆసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని, ప్రతి ఒక్కరు దైవాంధిక జీవితంలో ప్రతిరోజు ఒకసారి యోగాసనాలు వేయాలని కోరారు. యోగాసానాలు మనిషి ఆరోగ్యానికి మానసిక వికాసాన్ని ఇస్తాయని, ప్రతి ఒక్కరు యోగా, ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగెంద్ర ఉత్సవాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలని సూచించారు. యోగ కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి దృఢత్వం చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిటిడిసి బాబు నిండు నూరేళ్లు జన్మ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలి

పోడూరు మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి.



**పోడూరు జూన్ 2 మనం న్యూస్ :** వైయస్సార్సిపి సీనియర్ నాయకులు,జిన్నూరు సొసైటీ మాజీ చైర్మన్, డిటిడిసి బాబు జన్మదిన వేడుకలు జిన్నూరు,పాలకొల్లులో వైఎస్ఆర్సిపి శ్రేణులు, ఆయన అభిమానులు, మధ్య ఘనంగా జరిగాయి.కాగా డిటిడిసి బాబు జన్మదినోత్సవం సందర్భంగా పోడూరు మండలం వైఎస్సార్సీపీ అధ్యక్షులు కొర్రపాటి వీరాస్వామి వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి జిన్నూరు డిటిడిసి బాబు స్వగ్రామంలో ఆయన గృహం వద్ద జన్మదిన వేడుకలలో పాల్గొని డిటిడిసి బాబు చేత కేక్ ను కటింగ్ చేయించి డిటిడిసి బాబుకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోడూరు మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కొరపాటి వీరస్వామి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, జిన్నూరు సొసైటీ మాజీ చైర్మన్, నిస్వార్థ సేవ పరుడు అయినటువంటి డిటిడిసి బాబు మునుముందు ఆ భగవంతుని దయవల్ల ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లి, పిల్లాపాపలతో సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అంతేకాకుండా ఆయన నిండు నూరేళ్లు జన్మ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని అన్నారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**రాజమహేంద్రవరం, జూన్ 2, మనం న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రీ వారి ఆధ్వర్యంలో సోమవారం తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం లంకూరు గ్రామం లో కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ తెలియజేసినారు. ఈ వైద్య శిబిరం లో డా"శ్రీనివాస్ రాయుడు. డా "సత్యం రమేష్ బాబు. పాల్గొని,సుమారు 250మందికి రోగులకు వైద్యసేవలు అందించినారు వీరిలో 100మందికి రక్త నీరుడు పరీక్షలు, 04 గురుకి థైరాయిడ్ పరీక్షలు చెసినారు. పరమహంస యోగానంద నేత్రలయ వేమగిరి వారిచే సుమారు66మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 14 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రి కి తీసుకుని వెళ్ళినారు.14 మందికి కళ్లజోళ్లు ఇవ్వనున్నారు. మరియు .ఈ శిబిరంలో పరమహంస యోగానంద నేత్ర లయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు సిబ్బంది పాల్గొన్నారు. కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో రోగులకు సహాయకులుకు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ,కస్తూరిబా గాంధి ఆశ్రమప్రతినిధి కుమారి జి. సుశీల రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ యన్నమని వెంకట నారాయణ పాల్గోన్నారు.

మనం

మంగళవారం 03 - 06 - 2025

## పొడగట్లపల్లిలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం




**రావులపాలెం జూన్ 2 మనం న్యూస్.** కొత్తపేట సిడిపిఓ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు మండలంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పరిధి పొడగట్లపల్లి బెజవాడ గోపాలరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగసత్యవేణి అధ్యక్షతన యోగాంధ్రలో భాగంగా రంగోలి కార్యక్రమంలో ముగ్గులు పోటీలు ఏర్పాటు నిర్వహించారు. ముగ్గులు పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పంచాయతీ కార్యదర్శి టి శుభాకర్ చేతులు మీదుగా అందచేసారు. ఈకార్యక్రమంలో మహిళా పోలీసులు, ఎఎన్ఎమ్ లు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు అధిక సంఖ్యలో కిషోరి బాలికలు పాల్గొన్నారు.

## 56వ డివిజన్‌లో ఘనంగా ఎమ్మెల్యే సుజన చౌదరి జన్మదిన వేడుకలు






**గాంధీనగర్ జూన్ 2 మనం న్యూస్ :** పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ సుజన చౌదరి పుట్టినరోజు సందర్భంగా విజయవాడ పాత రాజరాజేశ్వరి పేట 56వ డివిజన్‌లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని కేదారేశ్వరపేట మండల అధ్యక్షుడు మాగులూరి లావిన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకల్లో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నున్న కృష్ణ, బీజేపీ వైస్ ప్రెసిడెంట్ గాయత్రి, మోహన విజయ్, జ్యోతుల విజయ్ రాజు, సీనియర్ నాయకులు డివిడి ప్రసాద్, దిలీప్, ఫుల్లర్ కట్, మైనారిటీ నాయకురాలు అస్మతున్నేసా, వసుంధర, కూటమి నాయకులు దనేకుల సుబ్బారావు, రౌతు వాసు, శ్యాము తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే సుజన చౌదరికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సామాజిక బాధ్యతగా పేదలకు దాదాపు వందమందికి పైగా చీరలు, దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం ప్రజల హృదయాలను గెలుచుకుంది. నున్న కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని స్థానికులు పేర్కొన్నారు.ద

## నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" కు 25 ఫిర్యాదులు




**రాజమహేంద్రవరం, జూన్ 02, మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు అడిషనల్ ఎస్పీ( అడ్మిన్) ఎన్. బి.ఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పి( లా అండ్ ఆర్డర్) ఏ.వీ సుబ్బరాజు నిర్వహించి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించినారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పి.జి.ఆర్.ఎస్" కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనగా ది. 02.06.2025 తేదీన తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన "పి.జి.ఆర్.ఎస్" కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఫిర్యాదులను పరిశీలించి, వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు అందజేశారు. "పి.జి.ఆర్.ఎస్" కార్యక్రమానికి 25 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు మరియు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడమైనది.

## ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం




**కాట్రేనికోన జూన్ 2 మనం ప్రతినిధి :** కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం నందు సి డి పి ఓ ఐ విమల ఆధ్వర్యంలో "యోగాంధ్ర" కార్యక్రమం సోమవారం నిర్వహించటమైనది. అందమైన మరియు ఆకర్షణీయమైన యోగా చేస్తున్న వివిధ రూపాలను మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ముగ్గుల రూపంలో ప్రదర్శించటం జరిగింది.కార్యక్రమం లో ఐసీడీ ఎస్ సూపర్వైజర్లు కే వి వి ఎస్ తులసి కుమారి, కుమారి ఎల్.వి.రమణి, సి.హెచ్ జయవాణి పర్యవేక్షణలో కార్యక్రమం ఘనంగా నిర్వహించటం జరిగింది.కార్యక్రమం నందు ఎంపీడీఓ ఎస్ వెంకట చలం , తహసీల్దార్ సునిల్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ బి మమత, అర్ డబ్లు ఎస్ జే ఈ సుబ్రహ్మణ్యం, ఎం ఏ ఓ ప్రవీణ్ , అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ఈపీ 2020 లక్ష్యాలను సాధించేలా యూనివర్సిటీలకు ఎన్ఐఏటీ చేయూత




**గుంటూరు జూన్ 2 మనం న్యూస్:** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) 2020 మార్గదర్శకత్వంలో భారతదేశ విద్యా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పులో యూజీసీ, ఏఐసీటీఈ సంస్థలు విద్యను నైపుణ్యానికి పెద్దపీట వేసేలా మార్చేందుకు ఎంతగానో కృషి చేస్తూ అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఆశయాన్ని వేగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి నెక్ట్‌వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ (ఎన్ఐఏటీ) ప్రారంభించిన యూనివర్సిటీ భాగస్వామ్య మోడల్ ను భారతదేశంలోని పలు యూజీసీ అప్రూవ్డ్ యూనివర్సిటీలు అమలు పరుస్తున్నాయి. నైపుణ్య ఆధారిత విద్యకు దేశవ్యాప్తంగా అనుకరించదగినదిగా ఈ మోడల్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు తీసుకువచ్చేలా యూనివర్సిటీలను బలపరచడమే ఈ భాగస్వామ్యం యొక్క లక్ష్యమని నెక్ట్‌వేవ్, ఎన్ఐఏటీ కో ఫౌండర్ మరియు సీఈవో రాహుల్ అత్తులూరి అన్నారు. 'ఒక వైపు యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను తమదైన విధంగా కొనసాగిస్తుంది. మరో వైపు విద్యార్థులు ఇండస్ట్రీకి సిద్ధమవ్వడానికి అవసరమైన ప్రతిదీ హ్యాండ్స్-ఆన్ స్కిల్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుంచి సెషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, ప్లేస్మెంట్స్ ఇలా కావలసిన అన్నింటిలో ఎన్ఐఏటీ తోడ్పాటునందిస్తుంది' అని ఆయన తెలిపారు.

## బొమ్ములూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్



**హనుమాన్ జంక్షన్ :జూన్ 2 మనం న్యూస్ :** బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో సోమవారం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల సహకారంతో కేంద్ర ప్రభుత్వం 700 జిల్లాల్లో శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో కోటిన్నర మంది రైతులతో ప్రత్యక్ష సంభాషణ ద్వారా నూతన సాంకేతిక మరియు ప్రభుత్వ పథకాలపై సమాచారం ఇచ్చే నిమిత్తం మండలంలోని ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో "వికసిత కృషి సంకల్ప అభియాన్" సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ , డాక్టర్ డి.సుధారాణి సస్య పోషణ, సస్యరక్షణ , సాంకేతిక పరిజ్ఞానం అవసరం గురించి వివరించారు. బాపులపాడు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవానీ ,తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి , రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్, బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, బొమ్ములూరు సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. పార్థసారథి, మండల తెలుగు రైతు నాయకులు తుమ్మల బ్రహ్మాజీరావు, కొల్లి వెంకట లక్ష్మీనారాయణ, పుసులూరి లక్ష్మీనారాయణ, కొల్లి సత్య నారాయణ, వేగే కృష్ణా రావు,హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్, డాక్టర్ వి.మంజువాణి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో %×ఖీఖీజూ% కంపెనీ వారు డ్రోన్ ఆపరేషన్ డెమో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం పై కె. పార్థసారథి కూలంకషంగా వివరించారు.

మనం ఎఫెక్ట్

## మానవత్వంతో అవకాశం కల్పించాం...?

### మనం న్యూస్ ప్రతినిధితో ఓ అధికారి

**రాజమహేంద్రవరం, జూన్ 2, మనం న్యూస్ :** అధికారులకు కూడా మానవత్వం ఉంటుందని మరోసారి నిరూపించారు ఆర్ఎంసి అధికారి. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పుష్కరాల నేపథ్యంలో డ్రెయిన్లపై ఉన్న అక్రమ నిర్మాణాలను తన..పర బేధం లేకుండా కూల్చేస్తుంటే క్రింది స్థాయి అధికారులు మాత్రం కొందరి పట్ల మానవత్వం ప్రదర్శిస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం హోటల్ షెల్టన్ వద్ద జి ప్లస్ ఫోర్ తో అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ అక్రమ నిర్మాణమే ఆక్రమణ అయితే లోపలికి కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు రోడ్డుపై సుమారు ఐదు అడుగుల మేర రోడ్డును ఆక్రమించి ర్యాంపు నిర్మించారు. దీనిపై ఓ అధికారిని మనం ప్రతినిధి ప్రశ్నించగా మానవత్వంతో వదిలేసామని సమాధానమిచ్చారు. అదే రోడ్లో ఒక స్కూలు వద్ద స్కూలు గోడ ను(డ్రెయిన్)ఆనుకుని రెండు ఇనుప పోల్స్, రోడ్డువైపు రెండు పోల్స్ ను వేయగా హుటాహుటిన సంబంధిత అధికారి వచ్చి వాటిని తీయించి వేయడం జరిగింది.






ఆయా బాధితులపై అధికారులు మానవత్వం ప్రదర్శించకపోవడం ఆమానుషం. దీనిపై పై స్థాయి అధికారి ఏం సమాధానం ఇస్తారో వేచిచూద్దాం.

## ప్రమాదంలో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.35 లక్షల బీమా చెక్కులు అందించిన జనసేన ప్రధాన కార్యదర్శి, ఎం ఎల్ సి నాగబాబు






**విజయవాడ జూన్ 2 మనం న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రమాదవశాత్తు మరణించిన పలు కుటుంబ సభ్యులకు మంజూరైన జనసేన పార్టీ ప్రమాద బీమా చెక్కులను సోమవారం మంగళగిరిలోని ఆర్ ఆర్ ఆర్ కన్వెన్షన్ నందు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఎమ్మెల్సీ నాగబాబు, హరి ప్రసాద్ ల తో కలిసి ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అందజేశారు. జగ్గయ్యపేట నియోజవర్గం పెనుగంచిప్రోలుకు చెందిన గజ్జి గోపీచంద్, మైలవరం నియోజవర్గం కు చెందిన బాదావత్ గోపి, విజయవాడ వెస్ట్ నియోజకవర్గ చెందిన కృప మనోజ్ మరియు దొండపాటి చంద్రశేఖర్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కు చెందిన ఆవల సాయి ఫణిందర్, లింగమా సాయి రంగనాథ్, విజయవాడ వెస్ట్ కు చెందిన పోతుల దుర్గారావు ల కుటుంబ లకు ఐదు లక్షలు చొప్పున ఏడు కుటుంబాలకు 35 లక్షల రూపాయల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణ జిల్లా డి సి ఎం ఎస్ చైర్మన్ బండ్రెడ్డి రామకృష్ణ , జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు గారు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ , పలు జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షులు, జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త బాడిశ మురళీకృష్ణ , పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు తునికిపాటి శివ , ఉపాధ్యక్షులు తన్నీరు గోపీనాథ్ , మండల నాయకులు పాల హరికృష్ణ ,జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా ఉచ్చిల రవి పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం జూన్ 2 మనం న్యూస్ :** డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ సెక్రటరీ ఉచ్చిల రవి కుమార్ పుట్టినరోజు వేడుకలు మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా కీసర మండలం నాగారం గ్రామం లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వివేకానంద నగర్ కాలనీ వాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో శ్రీహరి, బిల్డర్ విజయ్ కుమార్, యాకోబు, శ్యాం, మల్లి ఖార్జున్, కృష్ణ, రాజు, గణేష్, ప్రశాంత్, వినయ్, నాగయ్య, రవి కుమార్, సతీష్, కుమార్, బాలు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సత్యనారాయణపురంలో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం




**విజయవాడ జూన్ 2 మనం బ్యూరో:** సోమవారం ఉదయం విజయవాడలోని నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి అతిథులుగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా, విజయవాడ సి పి రాజశేఖర్ బాబు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు హాజరువ్వడం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రత ల పరిరక్షణ కోసం సిసి కెమెరాలు,డ్రోన్స్, పోలీస్ స్టేషన్ ఆధునీకరణకు సహరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా లోని పోలీస్ స్టేషన్ల ఆధునికరణ తోపాటు అభివృద్ధి కి కృషి చేస్తున్న కమిషనర్ రాజశేఖర్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు.హోం మినిస్టర్ అనిత ఆధ్వర్యంలో రాబోయే రెండు మూడు ఏళ్లలో రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ మోడరన్ పోలీస్ స్టేషన్ అవుతుందని తెలియజేశారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయానికి దీటుగా సత్యనారాయణ పురం పోలీస్ స్టేషన్ నిర్మాణం జరిగిందని అన్నారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ విభాగం లో రాష్ట్రం లోనే ఆదర్శవంతమైన జిల్లాగా తయారు అవుతుంది అని వివరించారు.ఇప్పటికే జగ్గయ్యపేట, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో మొత్తం, నందిగామ నియోజకవర్గం లో 80శాతం సిసి కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్ల అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం పై ఆధారపడకుండా దాతలు ముందుకు రావాలని పిలుపు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తూ.గో జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

### బాధితులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ

### తరుచు రోడ్డు ప్రమాద ఘటనలు, గోదావరిలో మునిగి చనిపోతుండటంపై ఆవేదన

### ఘటనలు పునరావృతం కాకుండా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని వెల్లడి





**రాజమహేంద్రవరం జూన్ 2 మనం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లాలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి చెందారు. సమాచారం తెలిసిన వెంటనే అప్రమత్తమైన మంత్రి దుర్గేష్ హుటాహుటిన రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు.విగతజీవులై ఉన్న మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. తరుచు రోడ్డు ప్రమాద ఘటనలు,గోదావరిలో మునిగి పలువురు మృతి చెందుతుండటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. రంగంపేట మండలం వడిశలేరు సమీపంలో రోడ్డు మలుపు కనిపించకపోవడంతో ప్రమాదం సంభవించిందన్నారు. ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారని, మరో ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. ఘటనలో చిన్నారులు చనిపోవడం మనసు కలిచివేసిందన్నారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.స్థానిక సాయి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఘటనాస్థలం నుండే వైద్య సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియ త్వరితగతిన చేయాలని ఆదేశించారు.తరుచు రోడ్డు ప్రమాదాలు జరగకుండా యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్ లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా నిర్ణయాలు చేస్తామన్నారు. జనసేన సభ్యత్వం ఉన్న వారికి పార్టీ తరపున సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## మొక్కజొన్న పీచును పడేయకండి.. ఈ విషయాలు తెలిస్తే పీచును దాచి పెట్టుకుంటారు..



మొక్కజొన్నలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఒకప్పుడు ఇవి కేవలం సీజన్‌లోనే అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు ప్రతి సీజన్‌లోనూ అందుబాటులో ఉంటున్నాయి. మొక్కజొన్నలను చాలా మంది ఉడకబెట్టి లేదా కాల్చి తింటారు. ఎలా తిన్నా కూడా ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. అయితే మొక్కజొన్నలను ఒలిచిన తరువాత కంకులను పడేస్తారు. కానీ వాటికి ఉండే పీచు మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అమెరికా, చైనా సంప్రదాయ వైద్య విధానంలో మొక్కజొన్న పీచును కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇందులో అనేక పోషకాలతోపాటు ఔషధ విలువలు కూడా ఉంటాయి. మొక్క జొన్న పీచు వల్ల మనకు కలిగే లాభాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఆర్థరైటిస్ నొప్పులకు..

మొక్కజొన్న పీచులో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, స్టెరాల్స్, సాపోనిన్స్, అల్లన్‌టోయిన్, ఆల్కలాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చు. శరీరంలోని వాపులు సైతం తగ్గిపోతాయి. మొక్క జొన్న పీచులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ఈ పీచులో ఉండే మెగ్నిషియం వాపులను, నొప్పులను తగ్గిస్తుంది. అందువల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది.

డయాబెటిస్ తగ్గేందుకు..

మొక్కజొన్న పీచు వల్ల షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. క్లోమ గ్రంథిలో డ్యామేజ్ అయిన బీటా కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల ప్రకారం తరచూ మొక్కజొన్న పీచును తీసుకోవడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని తేల్చారు. అయితే పీచును నేరుగా తినలేరు కనుక దీన్ని నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. ఈ పీచు సహజసిద్ధమైన డైయురెటిక్‌గా కూడా పనిచేస్తుంది. శరీరంలో అదనంగా ఉన్న ద్రవాలను బయటకు పంపుతుంది. దీంతో పాదాలు, చేతుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. అలాగే బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ పీచు ఎంతో మేలు చేస్తుంది.

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు..

మొక్కజొన్న పీచు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లను సైతం తగ్గిస్తుంది. మూత్రాశయం, జననావయవాల దగ్గర బ్యాక్టీరియా, ఫంగస్ చేరకుండా చూస్తుంది. మూత్రం ధారాళంగా వచ్చేలా చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలు పూర్తిగా బయటకు వెళ్లిపోతాయి. కిడ్నీ స్టోన్ల సమస్య ఉన్నవారు మొక్క జొన్న పీచు వేసి మరిగించిన నీళ్లను రోజూ తాగుతుంటే స్టోన్స్ కరిగిపోతాయి. మూత్రాశయ సంబంధ సమస్యలు ఉన్నవారికి కూడా ఈ కషాయం ఎంతగానో పనిచేస్తుంది. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు ఈ పీచును ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. ఇలా మొక్కజొన్న పీచుతో అనేక లాభాలను పొందవచ్చు.